# పేద కుటుంబానికి అండగా కేటీఆర్

- చిన్నారుల వైద్య ఖర్చులు భరించిన మాజీ మంత్రి
- ధన్యవాదాలు తెలిపిన తల్లిదండ్రులు



దవాఖానలో చికిత్స పొందుతున్న సంజన, బిందును పరామర్శిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య

రామారెడ్డి, ఫిబ్రవరి 25: కూల్‌డ్రింక్ అనుకొని గడ్డి మందు తాగి దవాఖాన పాలైన ఇద్దరు చిన్నారులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. పార్టీ నేతలను దవాఖానకు పంపించి వారి వైద్యానికి అయిన ఖర్చును చెల్లించారు. రామారెడ్డి మండలం స్కూల్‌తండాకు చెందిన గంగావత్ మంత్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు సంజన (10), బిందు(7) ఉన్నారు. మంత్ ఉన్న 25 గుంటల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. పొలానికి కొట్టేందుకని ఇటీవల ఫర్టిలైజర్ షాప్ నుంచి కొనుక్కొచ్చిన మందును థమ్సప్ బాటిల్‌లో నింపి పెట్టాడు. గత శనివారం స్కూల్ నుంచి వచ్చిన ఇద్దరు కూతుళ్లు థమ్సప్ బాటిల్‌ను చూసి కూల్‌డ్రింక్‌గా భావించి తాగారు. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు కామారెడ్డి దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట్ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందిన తడర్వాత అక్కాచెల్లెలు కోలుకున్నారు. అయితే, పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న తల్లిదండ్రులు దవాఖాన ఫీజు కట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్యను దవాఖానకు వెళ్లాలని ఆదేశించారు. కేటీఆర్ ఆదేశాలతో మంగళవారం దవాఖానకు వెళ్లిన ఆగయ్య చిన్నారుల తల్లిదండ్రులను పరామర్శించారు. పిల్లల వైద్యానికి అయిన ఖర్చును చెల్లించి దగ్గరుండి డిశ్చార్జి చేయించి ఇంటికి పంపించారు. కేటీఆర్, పార్టీ నేతలకు చిన్నారుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

### జిల్లా విద్యాధికారిగా జనార్దన్‌రావు

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 25: జిల్లా విద్యాధికారిగా వీఎస్ జనార్దన్‌రావును నియమిస్తూ స్కూల్ ఆఫ్ డైరెక్టర్ మదన్‌మోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత పనుల నిమిత్తం లీవు తీసుకున్న నేపథ్యంలో కరీంనగర్ డీఈవోగా విధులు నిర్వహిస్తున్న జనార్దన్‌రావుకు ఫుల్ అడిషనల్ బాధ్యతలు ఇచ్చినట్లు తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6,7,8,9,10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 28 నుంచి మార్చి 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆ ఫారంను పాఠశాలలో సమర్పించాలని సూచించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎమ్మెల్సీ పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ
- కోనరావుపేట పోలింగ్ కేంద్రం తనిఖీ



కోనరావుపేటలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ



జిల్లా కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కోనరావుపేట, ఫిబ్రవరి 25: శాసనమండలి ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పోలింగ్ సజావుగా జరిపేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలుండాలని, సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం వెంకట్రావుపేటలో ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఇక్కడ వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు తదితరులున్నారు.

**పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు**

కలెక్టరేట్, ఫిబ్రవరి 25: ఫిబ్రవరి 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 27న గురువారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, వాణిజ్య సంస్థలు, దుకాణం, వ్యాపార సంస్థల్లో ఎవరైనా ఉపాధ్యాయులు, పట్టభద్రులు పనిచేస్తూ ఉంటే వారికి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఓటర్లందరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని జిల్లా ఎన్నికల అధికారి సందీప్ కుమార్ ఝూ ఆ ప్రకటనలో తెలిపారు.

**ఎన్నికలకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ**

రాజన్న సిరిసిల్ల, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 25: ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్ల, తంగళ్లపల్లి, చందుర్తి పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 200 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 41పోలింగ్ కేంద్రాల్లో 23,347మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ ప్రక్రియ మొదలు నుంచి పూర్తయ్యే వరకు పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఇక్కడ పట్టణ సీఐ కృష్ణ, రూరల్ సీఐ మొగిలి, తదితరులున్నారు.

### మండలానికి చేరిన టెన్త్ ఆన్సర్ బుక్‌లెట్స్

కోనరావుపేట, ఫిబ్రవరి 25: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పరీక్షలకు సంబంధించిన ఆన్సర్ బుక్‌లెట్స్ మండలంలోని ఆయా పరీక్ష సెంటర్లకు చేర్చి భద్రపరిచినట్లు మండల విద్యాధికారి మురళీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మాదిరిగానే ధర్మారం జడ్పీ హెచ్ఎస్, కోనరావుపేటలోని మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగుతాయని ఆయా సెంటర్లలో సురక్షితంగా బుక్‌లెట్స్ భద్రపరిచమన్నారు. గతంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న క్రమంలో ఆడిషినల్స్ ఇచ్చేదని, కానీ ప్రస్తుతం 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్ ఒకేసారి ఇస్తామని వెల్లడించారు.విద్యార్థులకు సమయం వృథా కాకుండా పరీక్షరాసేందుకు వీలుకలుగనుందని పేర్కొన్నారు.

# అమ్మానాన్న.. నన్ను క్షమించండి

- నాకు బతకాలని లేదు..
- సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య
- ధర్మారంలో విషాదం



పోట్ల రాకేశ్ (ఫైల్)

కోనరావుపేట, ఫిబ్రవరి 25: 'కొద్ది రోజులుగా చావు నన్ను వెంటాడుతుంది.. యమ ధర్మరాజు పిలుస్తున్నాడు. అమ్మానాన్న నన్ను క్షమించండి. నేను వెళ్తున్నా నేటితో నా కథ ముగిసింది. నా చావుకు ఎవరూ బాధ్యులు కాదు.. తమ్ముడిని మంచిగా చూసుకోండి.. బై బై అంటూ' ఓ యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కంటతడి పెట్టించింది. వివరాలిలా ఉన్నాయి. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన పోట్ల మంజుల, బాలమల్లు దంపతులకు ఇద్దరు కుమారులు రాకేశ్(18), సుమంత్ ఉన్నారు. పెద్ద కుమారుడు రాకేశ్‌ను తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేర్పించారు. వారు స్థానికంగా వ్యవసాయ పనులు చేసుకుంటూ కొడుకును చదివిస్తున్నారు. అయితే మూడో రోజుల క్రితం రాకేశ్ ఇంటికి ఫోన్ చేసి నాకు చదవాలనిపించడం లేదని చెప్పగా, ఇంటికి రా ఏదో పని చేసుకొని బతకొచ్చు అని ఇంటికి రమ్మని చెప్పారు. శనివారం రాకేశ్ హైదరాబాద్ నుంచి లగేజీ సర్దుకొని బయలుదేరి సిరిసిల్ల వరకు వచ్చి ధర్మారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌కు బ్యాగ్ ఇచ్చి ఇంటి వద్ద ఇమ్మని చెప్పి వెళ్లాడు. తల్లిదండ్రులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో రాకేశ్ అదృశ్యమయ్యాడని ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వేట్రాక్‌పై పడి రాకేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు పేరెంట్స్‌కు సమాచారం అందించారు. కొడుకు మృతి చెందాడన్న వార్త విని తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. రాకేశ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సహకార సంఘాన్ని సందర్శించిన నాబార్డు అధికారులు




వేములవాడ ప్రాథమిక సహకార సంఘంలో నాబార్డు అధికారులతో కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 25 : వేములవాడ ప్రాథమిక సహకార సంఘాన్ని మంగళవారం నాబార్డు అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వేములవాడ ప్రాథమిక సహకార సంఘ బ్యాంకుతోపాటు లింగంపల్లి గ్రామంలో పర్యటించారు. వేములవాడ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పనులతోపాటు రైతులకు అందజేస్తున్న సేవలు తెలుసుకున్నారు. సహకార సంఘాల పనితీరుపై వివరాలు సేకరించారు. దేశంలో 30 ప్రాథమిక సహకార సంఘాల్లో వేములవాడ ప్రాథమిక సహకార సంఘంను ఎంపిక చేసుకోగా పరిశీలించామని నాబార్డు అధికారులు వెల్లడించారు. ఇక్కడ నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సహకార సంఘం చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, నాబార్డు జీఎం రమేశ్‌బాబు, నాబార్డు అసిస్టెంట్ మేనేజర్ కామేశ్వర్‌రావు, హైదరాబాద్ రీజినల్ సీడీవో నిధి తివారి, సీఈవో లక్ష్మవో, పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులున్నారు.

# విద్యార్థుల్లో విజ్ఞానం పెంపే లక్ష్యం

- అబ్దుల్ కలామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రతినిధి పర్శరాములు





ఆవునూర్ పాఠశాలలో అంతరిక్ష నౌకలు, క్షిపణుల, ఉపగ్రహాల అవగాహన కల్పిస్తున్న (బి)అబ్దుల్ కలామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రతినిధులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 25 : విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించే లక్ష్యంతో ఐఎస్వో (ఇస్రో) డీఆర్డీవో వారు తయారుచేసిన అంతరిక్ష నౌకలు, క్షిపణులు, ఉపగ్రహాల నమూనాలను ఏర్పాటు చేశామని అబ్దుల్ కలామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రతినిధి పర్శరాములు తెలిపారు. మండలంలోని ఆవునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అబ్దుల్ కలామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రతినిధి ఈసరి పరశురాములు, కోఆర్డినేటర్ సాయి బృందం ఆధ్వర్యంలో మిషన్స్, సాటిలైట్స్ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దికుంట లక్ష్మణ్, అబ్దుల్ కలామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగకు ఏర్పాట్లు చేపట్టాలి

- జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎంఏ భారతి
- రంజాన్ పీస్ కమిటీ సమావేశం

కలెక్టరేట్, ఫిబ్రవరి 25 : జిల్లాలో రంజాన్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి ఎంఏ భారతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో రంజాన్ మాసం సందర్భంగా 'రంజాన్ పీస్ కమిటీ సమావేశం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రంజాన్ మాసం పురస్కరించుకొని సంబంధిత జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయించాలని, ఈద్గాల్లో శానిటేషన్ చేయించాలని, విద్యుద్దీపాలు, నీరు అందుబాటులో ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారికి, మున్సిపల్ కమిషనర్ ద్వారా ఏర్పాట్లు పర్యవేక్షించాలని కోరారు. పోలీస్ శాఖ ద్వారా ట్రాఫిక్ సమస్యలు కలుగకుండా ఏర్పాట్లు చేయిస్తామని సహర్, ఇఫ్తార్ సమయం, ప్రార్థన సమయాల్లో తప్పనిసరి విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. అనంతరం సమావేశానికి హాజరైన ముస్లింలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో, ఎస్‌డీసీ ఆర్‌వీ రాధాబాయి, జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేశ్, డీసీఎస్‌వో పీ వసంత లక్ష్మి, డీఎస్పీ మురళీకృష్ణ, సెస్ ప్రతినిధి డీ అరవింద్ చారి, తహసీల్దార్ ఎం ఉమారాణి, ముస్లిం మత పెద్దలు, మజీద్ కమిటీ అధ్యక్షులు, కోఆప్షన్స్ మెంబర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

CHANGE OF NAME
★ I Palle Srilatha (New Name) Previously MANTRI SATYADEVI (Old Name) W/o. Palle Rajashekar R/o. H.No. 2-88/A/3, Jawaharpet Vill. Ellanthakunta Mdl . Rajanna Sircilla Dist.TS. and Solemnly declare
NTK-00000

CHANGE OF NAME
★ Asiniparthy Nandaiah S/o. Ramaswamy H.No. 4-44, R/o. Yengal, Chandurthy Mandal Rajanna Sircilla Dist. Hereby by Declared I Have Changed My son name from Asiniparthy Kevin ken (Old Name) to **Asiniparthy Vikram** (New Name)
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## బీజేపీలో కొనసాగుతున్న కోల్డ్‌వార్!

- వికాస్ ప్రచారానికి రామకృష్ణ టీం డుమ్మా
- ఆరు నెలలుగా పార్టీలో కొనసాగుతున్న అయోమయం



వేములవాడ, ఫిబ్రవరి 25: వేములవాడ బీజేపీలో నాయకుల మధ్య జరుగుతున్న కోల్డ్‌వార్ పార్టీ క్యాడర్‌ను అయోమయంలోకి నెట్టేస్తున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో వేములవాడ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ చెన్నమనేని వికాస్ బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతోంది. బుధవారం వేములవాడలో పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి తరపున డాక్టర్ వికాస్ ప్రచారం చేశారు. ఈ ప్రచారానికి రామకృష్ణ అనుచర వర్గం ఎవరూ కూడా హాజరుకాకపోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అయితే గత పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నుంచి మొదలైన కోల్డ్‌వార్ ఆరు నెలలుగా ఇరువురి మధ్య కొనసాగుతూనే ఉండడం పార్టీ క్యాడర్‌ను కొంత అయోమయానికి గురిచేస్తున్నది. పట్టణంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున ప్రచారానికి వచ్చిన రామకృష్ణతోపాటు పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, రూరల్ మండలాధ్యక్షుడు పరమేశ్‌తో వేములవాడలోని నాయకులెవరూ కూడా హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

## జాతర ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ,ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 25 : మహాశివరాత్రిని పురస్కరించుకుని వేములవాడ రాజన్న ఆలయంలో, వివిధ స్థలాల్లో ఏర్పాట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలోని క్యూలు, లడ్డూ ప్రసాదాల తయారీ స్థలం, పార్కింగ్‌ను పరిశీలించి ఆలయ అధికారులకు సూచనలు చేశారు. వారి వెంట ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేశ్‌కుమార్, ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేశ్, ఏఈవో శ్రవణ్, సీఐ వీరప్రసాద్ తదితరులున్నారు.

**భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి**

వేములవాడ, ఫిబ్రవరి 25: వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. మహాశివరాత్రి జాతర ప్రారంభం సందర్భంగా మంగళవారం పట్టణంలో ఏర్పాట్లు పరిశీలించి పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ సీఐ వీరప్రసాద్, ఎస్ఐ రాజు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**రాజన్న ఆలయంలో నేడు ఆర్జితసేవలు బంద్**

మహాశివరాత్రిని పురస్కరించుకుని రాజన్న ఆలయంలో బుధవారం భక్తులు గర్భగుడిలో నిర్వహించుకునే ఆర్జితసేవలను రద్దు చేశారు. స్వామివారికి నిత్యపూజలు యధాతథంగా కొనసాగుతాయని ఆలయ అధికారులు వెల్లడించారు.

### నేడు రాజన్నను దర్శించుకోనున్న ఎమ్మెల్సీ కవిత

వేములవాడ, ఫిబ్రవరి 25: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ బుధవారం దర్శించుకుంటారని నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహా రావు మంగళవారం తెలిపారు. ఉదయం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకుంటారని ఆయన తెలిపారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు

- మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 25: రామలక్ష్మణుల పల్లె నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, అసలే భూగర్భ జలాలు అడుగంటి పోతుంటే హరిదాస్‌నగర్–రామలక్ష్మణుల పల్లె శివారు నుంచి ఉదయం 7 గంటల నుంచే అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ఉండగా సీసీరోడ్లు, ఇంకా ప్రారంభం కాని ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. దీనిపై ఎంఆర్‌వో సురేశ్‌ను వివరణ కోరగా రామలక్ష్మణుల పల్లెలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని కానీ ఆవునూరు వద్ద చెక్‌డ్యాం ఉన్న కారణంగా దాని వెనుక భాగంలో ఉన్న ఆవునూరు శివారు నుంచే అనుమతి ఇచ్చామన్నారు. అవే ట్రాక్టర్లు రామలక్ష్మణుల పల్లె నుంచి వెళ్తున్నాయని తెలిపారు.

## కాంగ్రెస్ నాయకులు మాట నిలబెట్టుకోవాలి

- మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 25: మల్కపేట నీళ్లను కాల్వలోకి వదిలి కాల్వ పరీవాహక రైతుల సమస్యను పరిష్కరిస్తామన్న కాంగ్రెస్ నాయకులు మాట నిలబెట్టుకోవాలని మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాల్వలో నీళ్లు వదిలి తామేదో గొప్ప పని చేసినట్లు అర్భాటం చేసిన నాయకులు పంటలెండుతుంటే నేడు మౌనంగా ఎందుకున్నారని ప్రశ్నించారు. మిడ్‌మానేరు నీటిని మల్కపేట రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేసి సింగసముద్రం ఆయకట్టు వరకు ఉన్న పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాశ్ తదితరులున్నారు.

### మోడల్ స్కూల్లో నీటి సమస్య తీర్చాలని కలెక్టర్‌కు వినతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 25 : నామాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో నీటి, మూత్రశాల సమస్య పరిష్కరించాలని తెర్లుమద్ది గ్రామ బీఆర్ఎస్ నాయకుడు బైతి నవీన్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం మండల కేంద్రంలో బైతి నవీన్ విలేకరులతో సమస్యలను వివరించారు. విద్యార్థులకు పాఠశాలలో తాగునీరు వంట అవసరాలకు నీటి కొరత తీవ్రంగా ఉందని, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. బాలికలకు మరింత ఇబ్బంది ఉందని టాయిలెట్ రూంలకు సరైన రక్షణ లేదన్నారు. నీటి సౌకర్యం లేక విద్యార్థులు వారి వెంట తీసుకెళ్తున్న తాగునీరు బాత్‌రూంలకు వినియోగించే పరిస్థితి పాఠశాలలో నెలకొందని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని పలుసార్లు ప్రిన్సిపాల్‌కు జిల్లా అధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కలెక్టర్ మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

## రైతు కుటుంబానికి తక్షణ సాయం అందజేత



అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న జెల్ల దేవయ్య భార్య పద్మకు లక్ష రూపాయల చెక్ అందజేస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

ముస్తాబాద్/కలెక్టరేట్, ఫిబ్రవరి 25: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి తక్షణ సహాయం కింద ప్రభుత్వం లక్ష రూపాయలు అందించిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన రైతు జెల్ల దేవయ్య ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణ సహాయం కింద లక్ష రూపాయలు అందిస్తునన్నామని, మంగళవారం అధికారుల చేతుల మీదుగా చనిపోయిన రైతు సతీమణి పద్మకు రూ.లక్ష చెక్కు పంపిణీ చేశామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విజయోత్సవాలను విజయవంతం చేయాలి



సిరిసిల్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 25: టీఎన్జీవోస్ 80సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలను విజయవంతం చేయాలని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 317బాధితులు, కారుణ్య నియామకాలు, పీఆర్సీ పెండింగ్ డీఏలు పూర్తి చేయాలని కోరారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి గాజుల సుదర్శన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సమర్‌సేన్, ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు ఆకుల జయంత్‌కుమార్, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి జీవన్, టీఎన్జీవోస్ జిల్లా సహ అధ్యక్షుడు ఎం శ్రీకాంత్, కోశాధికారి రియాజ్‌పాషా, తదితరులున్నారు.

### విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 25 : వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మల్లారం గ్రామ యువకులు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదోతరగతి విద్యార్థులకు 60 పరీక్ష ప్యాడ్‌లను అందజేశామని, మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.